# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సంగీత నాటక అకాడమీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రధానం చేశారు.
- ❖ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నేటితో ముగిశాయి.
- ❖ గనులు, ఖనిజాల సవరణ బిల్లుతో రాష్ట్రాల హక్కులకు ఎటువంటి భంగం కలగదని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.
- ❖ ఢిల్లీతో పాటు వాయవ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

=======================

సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌లు అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు ప్రధానం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక ప్రత్యేక అవార్డుల ప్రదానోత్సవంలో 100 మందికి పైగా కళాకారులకు ఈ పురస్కారాలను ఫెలోషిప్‌లను అందించారు. కళలు, సంగీతం, నృత్యం, నాటకం, జానపద గిరిజన కళలు, తోలుబొమ్మలాట, సాంప్రదాయ నాటకాలు తదితర కళారూపాలకు విశేష సేవలు అందించిన కళాకారులను ఈ పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... అవార్డు గ్రహీతలు ఆధునిక భారతదేశ ప్రతిభ, అంకితభావానికి ప్రతిబింబమని చెప్పారు. సంగీతంలో అనేక సంప్రదాయాలు, జానపద నాటకాల్లో లెక్కలేనన్ని కళారూపాలు ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా విస్తరించిన సమృద్ధమైన జానపద సంస్కృతిని పరిరక్షించడంలో కళాకారులు కీలక పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేయడంతో సమావేశాలు ముగిసినట్లు ప్రకటించారు. జూలై 20న ప్రారంభమైన ఈ సమావేశాలు 25 క్యాలెండర్ రోజుల పాటు కొనసాగాయి. ఈ సమావేశాల సందర్భంగా పలుమార్లు నిరసనలతో తరచూ అంతరాయాలు ఏర్పడి శాసనపరమైన చర్చలు పరిమితమయ్యాయి. అయినప్పటికీ.. పార్లమెంట్ పలు కీలక బిల్లులను ఆమోదించింది. ఈ సమావేశాల్లో లోక్‌సభలో 11 బిల్లులు, రాజ్యసభలో రెండు బిల్లులు ప్రవేశపెట్టారు. మొత్తం 12 బిల్లులకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. వాటిలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నిరోధం) సవరణ బిల్లు, జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ) బిల్లు, జనన, మరణాల నమోదు (సవరణ) బిల్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు, బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు, కేరళ (పేరు మార్పు) బిల్లు, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సవరణ) బిల్లు, ట్రిబ్యునల్స్ సంస్కరణల బిల్లు, గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ సవరణ బిల్లు ఉన్నాయి. పేపర్ లీకేజీల నిరోధక బిల్లు ఈ సమావేశాల్లో కీలక అంశంగా నిలిచింది. పోటీ పరీక్షలు, ప్రభుత్వ నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలు, ఇతర అక్రమ పద్ధతులను అరికట్టే లక్ష్యంతో ఈ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ ఆమోదం లభించిన గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ సవరణ బిల్లు వల్ల ఏ రాష్ట్ర హక్కులూ హరించబడవని, రాష్ట్రాల ఆదాయ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఖనిజ ఉత్పత్తిని పెంచడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని తెలిపారు. మైనింగ్ రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ ప్రభుత్వ విధానంతో పని చేస్తోందని చెప్పారు. గనుల రంగం నుంచి రాష్ట్రాలకు లభించే ఆదాయ వాటా 65 శాతం నుంచి 85 శాతానికి పెరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఖనిజాల లభ్యతను పెంచడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం, రాష్ట్రాలను ఆర్థికంగా బలోపేతం చేయడం, బొగ్గు, ఖనిజాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం అనే నాలుగు ప్రధాన స్తంభాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు ఈరోజు పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆ ఫోటోలను సామాజిక మాధ్యమం వేదికగా పంచుకున్నారు. న్యూఢిల్లీలోని తన నివాసంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం, హర్ ఘర్ తిరంగా ప్రచారం ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావనను, జాతీయ గర్వాన్ని మరింత బలోపేతం చేస్తోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో పేర్కొన్నారు. కోట్లాది మంది పౌరులు త్రివర్ణ పతాకంతో అనుసంధానమవుతూ ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తున్నారని తెలిపారు. కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కూడా త్రివర్ణ పతాకంతో ఉన్న ఒక ఫోటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రజలు తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి.. జాతీయ గర్వాన్ని చాటుకునే ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో `అనీమియా ముక్త్ భారత్ అభియాన్ (AMB)`పై జాతీయ కార్యశాల న్యూఢిల్లీలో జరుగుతోంది. నిన్న ప్రారంభమైన ఈ కార్యశాలలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 160 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలీలా శ్రీవాస్తవ

మాట్లాడుతూ... రక్తహీనత సమస్యను సమగ్రంగా పరిష్కరించేందుకు వివిధ ఆరోగ్య కార్యక్రమాల మధ్య మరింత సమన్వయం అవసరమని అన్నారు. మెరుగైన సమన్వయంతో కూడిన జోక్యాలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు, సేవల పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. గర్భధారణ దశకే పరిమితం కాకుండా, చిన్న వయసు నుంచే పోషకాహారం తీసుకోవడంపై దృష్టి పెట్టాలని, ఆరోగ్యకరమైన జీవన శైలి ద్వారా రక్తహీనత నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (PM-RKVY), కృషోన్నతి యోజన (KY) కింద రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 605 కోట్ల 71 లక్షల రూపాయల నిధుల కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ఈ మొత్తం కేటాయింపుల్లో రాజస్థాన్‌కు 340 కోట్ల 59 లక్షలు, తెలంగాణకు 265 కోట్ల 12 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణ శివారులో ఉన్న గురుద్వారాలో శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై ఈరోజు కిర్పాన్‌తో దాడి జరిగింది. నిహాంగ్ వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో బాదల్ కుడి చేతికి స్వల్ప గాయమైంది. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు అకాలీదళ్ పార్టీ నాయకులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నైజీరియాలోని లాగోస్ నగరం వేదికగా నాలుగు రోజుల పాటు జరిగిన కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. అండర్-23, సీనియర్ విభాగాల్లో భారత ఫెన్సింగ్ బృందం అద్భుత ప్రతిభ కనబరిచి మొత్తం 35 పతకాలు సాధించింది. ఇందులో 13 స్వర్ణం, 8 రజతం, 14 కాంస్య పతకాలు ఉన్నాయి. ఈ పోటీల్లో భారత క్రీడాకారులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఓవరాల్ టైటిల్‌ను అందించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీతో పాటు వాయవ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. హర్యానా, చండీగఢ్, జాతీయ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల పాటూ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడనం కారణంగా వాతావరణంలో ఈ మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం రుతుపవన ద్రోణి సాధారణ స్థానం కంటే దక్షిణంగా కొనసాగుతోందని, దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక వర్షపాతానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని ఐఎండీ పేర్కొంది. గంగా పరివాహక పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఛత్తీస్‌గఢ్‌లో కూడా అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఎర్రకోట ఉగ్రదాడికి అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్ (AQIS) కారణమని అధికారికంగా నిర్ధారించినట్లు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వెల్లడించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన

ఉగ్రవాద నిరోధక ఆంక్షల పర్యవేక్షణ సంస్థ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయాన్ని పేర్కొంది. ఎర్రకోట సమీపంలో జరిగిన ఈ భారీ పేలుడులో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు.

========================

========================